క్లుప్తంగా

పాఠశాల సందర్శన



మక్కువ జెడ్పీహెచ్‌ఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఆర్‌పీ, డీఆర్‌పీలు

మక్కువ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్రస్థాయి సామాజిక తనిఖీ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ బి.దాసు, డీఆర్‌పీలు ఎస్.పోతురాజు, ఎస్.వెంకటేశ్వర్లు మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులు, లైబ్రరీ, స్పోర్ట్స్ మెటీరియల్, కిచెన్‌గార్డెన్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తయింది? భోజనం రుచికరంగా ఉందా? లేదా?తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో నిఘా నేత్రాలు



లచ్చయ్యపేటలో సీసీ కెమెరాల బిగింపు చేయిస్తున్న సర్పంచ్ కృష్ణ

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారి ,ప్రధాన కూడళ్లలో నిఘానేత్రాలు ఏర్పాటు చేశామని అపరిచిత వ్యక్తుల తిరుగాడడాన్ని, ప్రమాదాలు నివారించడానికి సునాయాసంగా గుర్తించవచ్చని ఏఎస్సై ఎల్ శ్రీనివాసరావు అన్నారు. ఎస్సై ఎం.రాజేష్ పర్యవేక్షణలో బుధవారం లచ్చయ్యపేటలో రాష్ట్రరహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన నిఘానేత్రా(సీసీ కెమేరాలు)లను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని జోగింపేట, మరిపివలస, సూరంపేట, చినభోగిలి, సీతానగరం,గుచ్చిమి, బూర్జ తదితర గ్రామాల కూడళ్లలో నిఘానేత్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ, గ్రామ పెద్దల సహకారంతో లచ్చయ్యపేట గ్రామం వద్ద, సుగర్‌ఫ్యాక్టరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శీతాకాలంలో ఆయుష్ వైద్యం మేలు



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ టి.హేమాక్షి

సీతానగరం: శీతాకాలంలో ప్రబలే పలురకాల ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో మంచి ఉపశమనం కలుగుతుందని బూర్జ ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు బుధవారం బూర్జ ఆయుర్వేద ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి వివిధ రకాల అరోగ్యపరమైన సమస్యలతో వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారు ఏ గ్రామం నుంచైనా ఆస్పత్రికి వస్తే ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడం వ్యాధి నిర్ధారణ అనంతరం మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఆయుర్వేద వైద్యం ద్వారా ఎటువంటి రుగ్మతలనైనా నయం చేయడానికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వై.పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణ అడ్డగింత



జేసీబీని అడ్డుకున్న సీపీఎం నాయకులు, దళితులు

సాలూరు రూరల్: మండలంలోని కరాసవలస దళితులు సాగు చేస్తున్న భూములను ఆక్రమించేందుకు చదును చేస్తున్న జేసీబీని సీపీఎం నాయకుడు మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దళితులు బుధవారం అడ్డుకున్నారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా కరాసవలసకు చెందిన దళితులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని దళితులపై దౌర్జన్యం చేసి వారు సాగుచేస్తున్న భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యాపారవేత్త రాజకీయ నాయకుడు సుతాపల్లి రాముపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత కుంటుంబాలు సాగుచేస్తున్న భూమిని చదును చేసేందుకు ప్రయంత్నించడం అన్యాయమన్నారు. ఆ భూముల్లో జీడి, టేకు వంటి మొక్కలు వేశారని వాటిని తొలగించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అలాగే భూములు తమవేనంటూ దళితులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సోంబార్కి సింహాచలం, వీరయ్య, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఆధార్ కేంద్రాలు

- పట్టించుకోని అధికారులు
- ఆధార్ చేయించకపోతే ఆగిపోనున్న అంగన్‌వాడీ సరుకులు
- గంటలతరబడి నిరీక్షిస్తున్న బాలింతలు



అంటిపేటలోఆధార్ సెంటర్, (ఇన్‌సెట్లో) పనిచేయని ఆధార్ పరికరాలు

సీతానగరం: బాలింతలు చిన్నారులతో ఆధార్ చేయించుకోవాలని లేనిపక్షంలో అంగన్వాడీ కేంద్రాలద్వారా ఇస్తున్న రేషన్ నిలిపి వేయనున్నట్లు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో బాలింతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని ప్రజలకు ఆధార్ కేంద్రాల్లో సవరణలు, చేర్పులు, మార్పులు, చిన్నారులకు ఆధార్ చేయించడానికి 5 ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయం, జోగింపేట, దయానిధిపురం, బూర్జ, అంటిపేట గ్రామసచివాలయాల్లో ఒక్కో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలోడిజిటల్ సహాయకులను నియమించారు. మండలకేంద్రంలో ఆధార్ సేంద్రం మినహాయిస్తే మిగతా సచివాలయాల్లో ఏర్పాటు చేసిన నాలుగు ఆధార్ కేంద్రాలు ఆరు నెలలుగా పని చేయడం లేదు. నాలుగు దిక్కులా నాలుగు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, వృద్ధులకు, ఆధార్ అనుసంధానం చేయాల్సిన వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేదని ప్రజలు అంటున్నారు. అయితే అవి పనిచేయడం లేదని వాపోతున్నారు. ఇటీవల కాలంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్న లబ్ధిదారులు, బాలింతలు చిన్నారులతో ఆధార్ చేయించుకోవాలని లేని ఎడల ప్రతినెలా అందజేస్తున్న పౌష్టికాహారం నిలిపివేస్తామని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆధార్ చేయించేందుకు చంటిపిల్లలతో బాలింతలు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సుల్లో చలిని, ఎండను తట్టుకుని మండలకేంద్రానికి చేరుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆధార్ చేయించుకునేందుకు నిరీక్షించాల్సి వస్తోంది. ప్రభుత్వం విద్యార్థులు, బాలింతలు ఆధార్ చేయించడానికి పడుతున్న కష్టాలకు స్పందించి మూలకు చేరిన ఆధార్ సెంటర్లు వినియోగంలోకి తెచ్చి ప్రజలకు మెరుగైన సేవలందించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మండలకేంద్రంలో బిజీగా ఉన్న ఆధార్ సెంటర్



ఆధార్ సెంటర్‌కు బక్కుపేట నుంచి వస్తున్న బాలింతలు

జోగింపేటలో ఆధార్ సెంటర్ పనిచేయక..



నాది నిడగల్లు గ్రామం, ఆధార్ చేయంచే సమయంలో పేరులో తప్పుదొర్లింది. బ్యాంక్ వారు ఆధార్ సరి చేయించుకోవాలని సూచించారు. మా గ్రామానికి జోగింపేట ఆధార్ సెంటర్ అందుబాటులో ఉంది. అయినా అక్కడి ఆధార్ సెంటర్ పనిచేయకపోవడంతో మండలకేంద్రానికి వచ్చాను. ఇక్కడ రద్దీగా ఉన్నందున సాయంత్రం వరకూ నిరీక్షించాల్సి వచ్చింది. సొంత పనులు మానుకుని రోజంతా ఇలాగే ఉన్నాను. ప్రభుత్వం ఆధార్ సెంటర్లు వినియోగంలోకి తేవాలి.

ఆర్ సత్యనారాయణ, నిడగల్లు

పడిగాపులు కాయాల్సి వచ్చింది..



నాది గెడ్డలుప్పి గ్రామం. ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ ద్వారా పౌష్టికాహారం ఇస్తోంది. ఆధార్ అనుసంధానంలో శిశువునే చేర్పించాలని లేనిఎడల రేషన్ ఇచ్చేది లేదని సంబంధిత సిబ్బంది చెప్పారు. దీంతో సోమవారం నాకుటుంబ సభ్యులతో ఉదయం మండల కేంద్రానికి వచ్చాను.అయినా ఆధార్ సెంటర్‌లో రద్దీగా ఉన్నందున సాయంత్రం వరకూ కుటుంబసభ్యులతో వేచిఉండాల్సి వచ్చింది. ప్రభుత్వం కేటాయించిన ఆధార్ సెంటర్లు పని చేస్తే ఇంతటి కష్టాలు పడాల్సి ఉండేది కాదు.

గొర్లి హిమబిందు, బాలింత, గెడ్డలుప్పి

పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలి



శంబరలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో కొండలరావు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి జాతరకు లక్షలాదిమంది భక్తులు శంబర గ్రామానికి చేరుకోనున్నందున గ్రామంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరిపించేలా చర్యలు చేపట్టాలని డీపీవో టి.కొండలరావు సూచించారు. శంబర గ్రామంలో ఈవోపీఆర్డీ పి.దేవకుమార్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పనులను డీపీవో కొండలరావు, డీఎల్‌పీవో ఎం.నాగభూషణరావు బుధవారం పరిశీలించారు. ఈనెల 29వతేదీ వరకు ప్రతిరోజూ పారిశుద్ధ్యపనులు జరిపించి, చెత్తను వెంటవెంటనే డంపింగ్ చేయించాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ జరిపించాలని చెప్పారు. జాతర మూడురోజులపాటు మున్సిపాల్టీల నుంచి వచ్చిన పారిశుద్ధ్య కార్మికులతో పనులు జరిపించాలని సూచించారు. మున్సిపాల్టీ అధికారులు, సిబ్బందికి భోజన, వసతి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

వేగావతిపై బ్రిడ్జి నిర్మాణం గత ప్రభుత్వ పుణ్యమే



పాంచాలి గ్రామానికివెళ్లే వేగావతి నదిపై గత ప్రభుత్వంలో నిర్మాణం చేసిన బ్రిడ్జి

సాలూరు రూరల్: సాలూరు మండలం నుంచి పాచిపెంట మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ వేగావతి నదిపై రూ.8.14 కోట్లతో నిర్మాణం చేసిన బ్రిడ్జి గత ప్రభుత్వం పుణ్యమే. గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించారనడానికి ఈ బ్రిడ్జి నిర్మాణం ఒక ఉదాహణగా చెప్పవచ్చు. ఎన్నో ఏళ్లుగా ఈ నది కాజ్‌వేపై నుంచే పాచిపెంట మండలంలోని పలు గ్రామాల ప్రజలు ప్రయాణించారు. అయితే వర్షాకాలంలో ఈ నదిని దాటాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారు. గతంలో వాహనాలు కొట్టుకు పోయిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో ఈ బ్రిడ్జి నిర్మాణం గావించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జిపై ప్రశాంతంగా పలు గ్రామాల ప్రజలతో పాటు ప్రస్తుత మంత్రుల కాన్వాయ్‌లు రయ్‌మంటూ ప్రయాణిస్తున్నాయి. ఇలాంటి బ్రిడ్జిలు రోడ్లపై ప్రయాణిస్తున్న స్థానిక మంత్రి 100 రోజులు 100 రోడ్ల పండగ అంటూ డబ్బాకొట్టుకోవడంతో పాటు గత ప్రభుత్వంలో అసలు రోడ్ల నిర్మాణమే కాలేదని అబద్ధాలు ప్రచారం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

టీకా కార్యక్రమం తనిఖీ



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని జగన్నాథరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా కార్యక్రమాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ కోసం సమీప గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులతో మాట్లాడి ఆరోగ్య తనిఖీ వివరాలు ఎంసీపీ కార్డులో పరిశీలించారు. కాన్పు తేదీలపై గర్భిణులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ జి.నిహారిక గర్భిణులకు యుపీహెచ్‌సీలో స్కానింగ్ నిర్వహించారు. ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రానికి తనిఖీల కోసం ఎంతమంది వస్తున్నారని ఓపీ రికార్డులో పరిశీలించారు.వ్యాక్సిన్,మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. లెప్రసీ, ఎన్సీడీ సర్వేలు, అంగన్వాడీ, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌ల గురించి అడిగి గుర్తించిన ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కోరారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ కొత్తవలసలోని 7, 8 వార్డుల్లో సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంతమంది పిల్లలకు టీకాలు వేశారు, టీకా వివరాలు, ఆర్సీహెచ్ రికార్డులో పరిశీలించారు. మొబైల్‌లో యూవిన్ పోర్టల్‌ను పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తకుండా నవజాత శిశు ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలని చెప్పారు. గర్భిణీ, శిశు ఆరోగ్య సూచనలకు సంబంధించి పోస్టర్స్ టీకా కేంద్రంలో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎంజీఎం చాంద్, సూపర్‌వైజర్స్ సత్తిబాబు, ఇందిర, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



కాశీపేటలో రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సీతానగరం: జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు గర్భిణులు ప్రీస్కూల్ పిల్లలకు నిర్దేశించిన సమయంలో పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకదుర్గ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట, కాశీపేట-1, అంటిపేట అంగన్వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో రికార్డులు, సరుకుల నిల్వలు, ప్రీస్కూల్ పిల్లల హాజరు, పిల్లల బరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లచ్చయ్యపేటలో పీడీ కనకదుర్గ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం విధిగా భుజించినప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని, ఐరన్‌లోపాన్ని నివారించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీఓ ఎస్.సులేఖ, ఎస్ఓ యు.పూర్ణిమ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

285 పశువులకు వైద్యసేవలు



కొత్తవలసలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్. రామారావు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం నిర్వహించిన పశు పశువైద్య శిబిరాల్లో 285 పశువులకు వైద్యసేవలు అందించినట్లు పశువైద్యాధికారులు ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్, డాక్టర్ ఎస్.రామారావు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది ద్వారా ఇప్పలవలస, జోగింపేట, బక్కుపేట, తామరఖండి గ్రామాల్లో 2396 గొర్రెలు మేకలు కోళ్లకు వ్యాధి నిరోధక మందులు వేసినట్లు తెలిపారు.

ఆరిశెట్టి మోహనరావుకు పరామర్శ



డా.ఆరిశెట్టి మోహనరావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డా. ఆరిశెట్టి మోహనరావును మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. ఇటీవల మోహనరావు కాలికి గాయాలైన నేపథ్యంలో బుధవారం రాజన్నదొర ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకుని, ప్రజలకు యథావిధిగా వైద్యసేవలను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, అప్పారావు పాల్గొన్నారు.

గోతుల మయమైన కొత్తవలస రోడ్డు

- ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్రవాహన చోదకులు



పెద్దపెద్ద గోతులతో నిండిన కొత్తవలస రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని కొత్తవలస రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి గోతులమయమైంది. మామిడిపల్లి రోడ్డు నుంచి కొత్తవలస గ్రామానికి చేరాలంటే కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో అడుగుకో గొయ్యి చొప్పున ఉండడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట అయితే మరీ ఈ రోడ్డు ప్రమాదభరితంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చీకట్లో ఏగోతిలో పడతామోనని అందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పూర్తిగా గుంతల మయంగా ఉన్న రోడ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్ల పండగ అంటే గ్రామం బాగుపడుతుందని ఎంతో ఆశగా ఎదురు చూసిన కొత్తవలస గ్రామ ప్రజలకు నిరాశే మిగిలిందని పెదవి విరుస్తున్నారు.

'అత్యం' మైనింగ్‌ను రద్దు చేయాలి

పార్వతీపురం టౌన్: గరుగుబిల్లి మండలం చిన గుడబ రెవెన్యూ పరిధిలో అత్యం మైనింగ్‌కు ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహజ సంపద రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యం మైనింగ్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొంది ఇష్టారాజ్యాం మైనింగ్ చేస్తోందని మండిపడ్డారు. అడవులు, వాగులు, ప్రజల ఆరోగ్యం ఏవీ పట్టించుకోకుండా ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు మైనింగ్ యాజమాన్యానికి వత్తాసుపలకడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు ఐక్యంగా పోరాటం చేయటానికి సిద్ధం కావాలని రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు హాజరయ్యే వారినే ఉంచాలి



పెదపెంకిలో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులను మాత్రమే పాఠశాల రికార్డులలో ఉంచాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. మండలంలోని పెదపెంకి, మిర్తివలస పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పట్టీని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రీ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, మోడల్ స్కూల్ పాఠశాలల నిర్వహణలో భాగంగా విద్యార్థుల రోల్‌పై పర్యవేక్షణ చేశారు. పాఠశాలకు హాజరుకాని వారు కాని, చాలా రోజులపాటు ఆబ్సెంట్‌గా ఉండేవారి పేర్లు కాని రికార్డుల్లో ఉంచరాదని సూచించారు. తప్పుడుగా ఏవో సర్దుబాటు నిమిత్తం ఎవరైనా పేర్లు నమోదు చేసి ఉంచితే అటువంటి వాటిని తొలగించాలని చెప్పారు. చెప్పిన తరువాత కూడా పేర్లను ఎవరైనా కొనసాగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు కూడా పాఠశాలలను పర్యవేక్షించి సరైన సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

30మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



పెదపెంకిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ మౌనిక

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 30మందికి వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి హాస్పిటల్ వారి సౌజన్యంతో సత్యసాయి మందిరం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన 30మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా 15మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు క్యాంపు కో ఆర్డినేటర్ లక్ష్మణ్ తెలిపారు. శస్త్రచికిత్సకు ఎంపికైన వారిని తీసుకువెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి, మందులు ఇచ్చి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఈశ్వరరావు, కె.శ్రీను, బి.తవిటిరాజు, జి.శ్రావణ్ కుమార్, కె.గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము ధూళితో ప్రయాణికుల అవస్థలు



మెటల్ వేసి వదిలేయడంతో ధూళిలో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహన చోదకులు

సాలూరు రూరల్: సాలూరు నుంచి మామిడిపల్లి వెళ్లే రోడ్డులో ప్రస్తుతం ప్రయాణానికి దుమ్ము ధూళితో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు గోతులు కప్పే క్రమంలో రోడ్డుపై మెటల్ వేసి రాయి బుగ్గి వేసి వదిలేశారు. దీంతో రోడ్డుపై పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణించడానికి దుమ్ము ధూళితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై నిత్యం క్వారీకి సంబంధించి భారీ వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుపై తారు వేయకపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు పెద్ద ఎత్తున ధూళి ఎగరడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకుండా పోఒతున్నాయని ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగి అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో గదబబొడ్డవలస, బంగారమ్మ పేట దాటిన వెంటనే కొంత భాగం అలాగే మామిడిపల్లి గ్రామంతో పాటు పలు చోట్ల ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వాహన చోదకులు కొద్ది రోజులుగా ఈ పరిస్థితి నుంచి ఎప్పుడు బయట పడతామా? అని ఆందోళన చెందుతున్నారు. వచ్చే వారం శంబర పోలమాంబ జాతరకు వేలామంది భక్తులు ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే ముఖ్యంగా ద్విచక్రవహన చోదకులు పూర్తిగా ఇబ్బంది పడాల్సి వస్తుందని పలువురు అంటున్నారు.గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శంబర రోడ్డు నిర్మాణంతో ఆ పరిస్థితి తప్పిందనుకుంటే మళ్లీ సగంసగం పనులతో దుమ్ముధూళితో ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు రక్షించిన వారికి నగదు పురస్కారం



సాలూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు రక్షించిన వారికి 25 వేల రుపాయల నగదు పురస్కారం అందించనున్నట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌లు అన్నారు. ఈ మేరకు జాతీయరహదారి భద్రతా మాసోత్సవాల నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపరాదని, వాహనాల రికార్డులను తప్పకుండా కలిగి ఉండాలని చెబుతూ ఇతర రహదారి భద్రత నియమాలను వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్స తదితర అంశాలపై అవగాహన పెంపొందించారు. జాతీయరహదారి భద్రతా మాసోత్సవాల ఆవశ్యకతను వివరిస్తూ, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ భాస్కరరెడ్డి, మెడికల్ ఆఫీసర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.